క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలి పోయిన ఐటీఐ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని గుడివాడ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మంజులాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10, 8వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలకు 08674–295953, 82975 74757లో సంప్రదించాలని కోరారు.

పంటల బీమా తప్పనిసరి



గుడ్లవల్లేరు: మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని ఏఓ ఎల్.సునీల్ పిలుపునిచ్చారు. మండలంలోని వెణుతురుమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యాక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాప్ లోన్ తీసుకున్న రైతులుకు సంబంధిత బ్యాంకులు పంటల బీమా కింద ప్రీమియం చెల్లింపులు చేస్తారన్నారు. క్రాప్ లోన్ తీసుకుని ప్రతి రైతు వరి పంటకు ప్రతి ఎకరాకు రూ.830 దగ్గర్లోని సి.ఎస్.సి సెంటర్‌కు వెళ్లి ప్రీమియం చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. పంటల బీమా చేయించుకోవటం వలన ప్రకృతి విపత్తులతో పంట నష్టం వాటిల్లినప్పుడు పరిహారం పొందాలంటే పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యశ్వంత్ రాజా తదితరులు పాల్గొన్నారు.

పులపర్రులో తాగునీటి ఇబ్బందులు



పులపర్రులో మంచినీటి చెరువు

మండవల్లి: మండలంలోని పులపర్రులో తాగునీటి ఇబ్బందులు తారాస్థాయికి చేరాయి. గ్రామంలోని తాగునీటి చెరువులో నుంచి గ్లాసుడు నీటిని కూడా గ్రామంలోని ఏ ఒక్కరూ తాగే పరిస్థితి లేదు. ఏన్నో ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారులు, పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు వాపోతున్నారు. కొల్లేరు ఏరియాలో ఉండటంతో చెరువును అభివృద్ధి చేయడానికి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు ససేమిరా ఒప్పుకోవడం లేదని చెబుతున్నారు.

చెరువు నీరు వాడుకోవడానికే..

చెరువులో నీటిని కేవలం వాడుకోవడానికి గ్రామస్తులు వినియోగిస్తున్నారు. పరిసరాల్లో అధిక శాతం రొయ్యల చెరువులు ఉండటంతో చెరువులో నీరు ఉప్పగా మారింది. దీంతో ఆ నీటిని ఏ విధంగానూ ఉపయోగించుకోవడం లేదు. మార్కెట్‌లోని 20 లీటర్ల క్యాన్లను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా మంచినీటి చెరువులో నీరు తాగడానికి పనికి వచ్చే విధంగా ఉండేటట్లు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి అవస్థలు



చాలా సంవత్సరాల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. పేరుకే మంచినీటి చెరువు ఉంది. చెరువులో నీరు ఉప్పగా ఉంటాయి. బయట మార్కెట్లో వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి నీటిని తాగుతున్నాం. చెరువును అభివృద్ధి చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందజేయాలని అధికారులను కోరుతున్నారు.

–పెద్దిరెడ్డి సత్యనారాయణ, పంచాయతీ సభ్యుడు, పులపర్రు

చెరువు ఉన్నా తాగునీటి కరువే



మంచినీటి చెరువు ఉన్నా గుక్కెడు తాగునీటికీ కరువే. గ్రామంలోని ఎవరి ఇంటికైనా బంధువులు వస్తే ఒక్క రోజుకు మించి ఉండటం లేదు. నీటి సమస్యతో తిరిగి వెళ్లిపోతున్నారు. అధికారులకు, పాలకులకు తెలియజేసినా ప్రయోజనం లేదు.

– సీహెచ్ శంకరరావు, పులపర్రు

మర్యాదపూర్వక కలయిక



కైకలూరులో డీఎన్నార్‌తో చింతలపూడి నియోజకవర్గ నాయకులు

కైకలూరు: స్వల్ప అస్వస్థత వలన కొద్ది రోజులు విశ్రాంతి తీసుకొని కైకలూరు ఏలూరు రోడ్డు పార్టీ కార్యాలయానికి వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) బుధవారం విచ్చేశారు. చింతలపూడి నియోజకవర్గం కామవరపు కోట మండల ఎంపీపీ మేడంకి విజయరావు, కామవరపుకోట సొసైటీ మాజీ చైర్మన్ సాయిన కనకరాజు, నాయకులు తాడిచర్ల మోహన్‌రావు, బట్ట సుబ్బారావు డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించుకున్నారు.

మధ్యవర్తిత్వంతో సులువుగా కేసుల పరిష్కారం



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



మొవ్వలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గుడివాడ టౌన్: మధ్యవర్తిత్వం ద్వారా సులువుగా కేసులు పరిష్కరించుకోవచ్చని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మధ్యవర్తిత్వం-దేశం కోసం అనే నినాదంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి ఏలూరు రోడ్, బైపాస్ రోడ్‌ల వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వం-దేశంకోసం అనే ఈ ప్రోగ్రామ్ 90 రోజులు నిర్వహిస్తామన్నారు. ఈ విధానంలో సమస్యను ఇరువైపులా తెలుసుకుని మాట్లాడి ఒప్పించి కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఇప్పటికి ఈ విధానంలో కేసులు పరిష్కరించామన్నారు. ఈ విషయాన్ని సమాజంలోకి తీసుకెళ్లేందుకు ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.అరుంధతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక కోర్టు న్యాయమూర్తి స్వర్ణలత వోల్గా మార్క బుధవారం పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మొవ్వలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతుఊ న్యాయస్థానంలో నిరంతరం జరిగే మధ్యవర్తిత్వ కార్యక్రమంలో వివాహ సంబంధమైన వివాదాలు, ప్రమాద, చెక్ బౌన్స్, భూముల పంపకాలు తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ర్యాలీలో ఆమెతో పాటు న్యాయస్థాన పర్యవేక్షకురాలు సావిత్రి, న్యాయస్థానం సిబ్బంది, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



ముగింపు సభలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో బొప్పన శరత్ గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్ర వైద్యాలయం సౌజన్యంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి పరీక్ష శిబిరం బుధవారం ముగిసింది. ఏ.ఏ.ఎన్.ఎం.అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ అనుబంధ విద్యాలయాలైన శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్, ఫార్మసీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి వైద్య నిపుణులు కంటి వైద్యం చేశారు. దృష్టి దోష లేదా లోప సంబంధిత రుగ్మతలపై స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. సుమారు 20మందికి శుక్ల, రెటీనా సంబంధిత సమస్యలు ఉన్న వారిని గుర్తించారు. మరొక 20మందిని లాసిక్ ఆపరేషన్లకు గుర్తించి శంకర కంటి ఆస్పత్రికి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు శంకర కంటి ఆస్పత్రి పి.ఆర్.ఓ. పుసులూరి కాశీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.నవీన్‌కుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మత్తి శివశంకర్, పి.ఆర్.ఓ. చాగంటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

స్టేడియం కమిటీ సభ్యుడికి నివాళులు



భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం శాశ్వత సభ్యుడు పొట్లూరి భాస్కరరావు సంతాప సభ బుధవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యుడు భాస్కరరావు 1987లో రూ. 5 వేలు చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారన్నారు. స్టేడియం అభివృద్ధిలో వారు చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాదు, కార్యవర్గ సభ్యులు ఎం. వీరభద్రరావు, కె. ఆంజనేయులు, పి. సాంబశివరావు, పి. ఆనంద్, పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయం



కైకలూరు: విద్యా బుద్ధులు నేర్పిన పాఠశాలకు పూర్వ విద్యార్థుల సాయం చేయడం అభినందనీయమని తామరకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చిట్టూరి సూర్య ప్రకాశరావు బుధవారం పేర్కొన్నారు. పాఠశాలలో అయ్యవారిరుద్రవం, మీగడాపురానికి చెందిన బుసనబోయిన శ్రీరామమూర్తి, బండారు నాగకోటేశ్వరరావు చదువుకున్నారు. చదివిన పాఠశాలకు సాయం చేయాలనే ఉద్దేశంతో వారిద్దరు మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడేందుకు రూ.30,000 ఖర్చుతో 180 ప్లేట్లు, 180 స్టీలు గ్లాసులను కొని పంపించారు. పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కొనియాడారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న అంగలూరు డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు

కంకిపాడు: క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన విద్య అవసరమని అంగలూరు డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై బుధవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ విధానాన్ని విడనాడాలని, పాఠాన్ని అర్థం చేసుకుంటూ చదవాలన్నారు. పరీక్షలకు సన్నద్ధమయ్యే సయయంలో భయాన్ని విడనాడాలన్నారు. ఏకాగ్రతతో విద్యాభ్యాసం సాగించాలన్నారు. పట్టుదల, సాధించాలనే తపన ఉండాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అవగాహన పెంపొందించేందుకు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పిడికిటి రామకోటేశ్వరరావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు తాళ్లూరి మరియబాబు, చోరగుడి మహేష్, ఇన్‌చార్జి హెచ్ఎం బుచ్చియ్య బాబు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న ఆర్టీసీ చైర్మన్



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

నూరు శాతం సబ్సిడీపై పండ్ల తోటల మొక్కలు

నున్న(విజయవాడరూరల్): ఉపాధి పథకంలో పండ్ల తోటల మొక్కలను నూరు శాతం సబ్సిడీపై చిన్న, సన్న కారు రైతులకు అందజేస్తామని విజయవాడ సబ్‌కలెక్టర్ కావూరి చైతన్య తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ఉపాధి పథకంలో మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి, ఆపిల్ బేర్, మునగ, మల్లి, గులాబి, అంజీర నూరు శాతం సబ్సిడీపై లభించే పండ్ల తోటల మొక్కలు, వాటి వివరాలను ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏఓ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పెనమలూరు: మండల పరిధిలో ఎరువుల దుకాణాలను బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. పెనమలూరు, పోరంకి ప్రాంతాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఎరువుల స్టాక్‌కు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయిస్తున్నారా లేదో తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న ఎరువులు, షాపుల్లో ఉన్న ఎరువులు స్టాకు సరిపోయాయా లేదా అని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎరువులన్నీ అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ధరలకే అమ్మాలని ఆదేశించారు. ఎరువుల స్టాక్‌లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు, ఏఓ కనకమేడల శైలజ, ఏఓ టెక్నికల్ లంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూడిదలో పోసిన పన్నీరు

- పంట కాలువలో నీరు పారుతున్నప్పుడు పొక్లయినర్‌తో పనులు
- నీటితో కూడిన మురుగు పోయడంతో బురదకయ్యగా రోడ్డు



కైకలూరు పంట కాలువలో నీరు ఉండగానే మట్టిని తొలగిస్తున్న పొక్లెయినర్



రోడ్డు సమీపంలో మట్టి పోయడంతో బురదకయ్యగా మారిన కోరుకొల్లు రోడ్డు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అదునులో చేస్తేనే పంట దిగుబడి ఉంటుందనేది నానుడి. పంట కాలువలో నీరు లేక ఖాళీగా ఉన్నప్పుడు మరమ్మతులు చేయకుండా నిండుగా నీరు ఉన్నప్పుడు పొక్లెయినర్‌తో మట్టిని తొలగించడం విమర్శల పాలవుతోంది. కైకలూరులో పోల్‌రాజ్ పరిధిలోని కైకలూరు చానల్‌లో బుధవారం పొక్లెయినర్‌తో మట్టిని తొలగించారు. ఇప్పటికే దాదాపు నెల రోజులుగా గుడ్లవల్లేరు లాకుల నుంచి పోల్‌రాజ్ కాలువకు సాగు, తాగునీటిని విడదల చేశారు. ఇప్పటి వరకు చానల్‌లో మరమ్మతులు చేయని అధికారులు నిండుగా నీరు ఉన్నప్పుడు పనులు మొదలుపెట్టారు. తూతూమంత్రంగా పనులు చేసి మమా అనిపిస్తారనే అనుమానం కలుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

బురద కయ్యగా రోడ్డు

కై కలూరు చానల్ కాలువలో శ్మశాన వాటిక నుంచి కొత్తపేట వరకు నీటిలో మట్టిని తొలగిస్తున్నారు. కాలువలో ఇప్పటికే నీటి ప్రవాహం ఉంది. పొక్లెయినర్‌తో తీసిన మట్టిని రోడ్డు సమీపంలో వేస్తున్నారు. నీటితో కూడిన బురద గట్టుపై పోయడం వలన కైకలూరు–కోరుకొల్లు రోడ్డుకు చేరుతుంది. దీంతో వాహనదారులు జారి పడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అడుగున మట్టిని తోడటం వలన నీరు కలుషితమవుతోంది. పైగా అడుగున ప్లాస్టిక్ కవర్లు పైకి తేలుతున్నాయి. ఈ నీరు దిగువకు చేరుతుంది. అంటే ఎగువ నుంచి వస్తున్న నీటిని మరమ్మతుల పేరుతో పొక్లెయినర్‌తో కలుషితం చేస్తున్నారు. పైగా ఈ సమయంలో వర్షం పడితే కాలువ గట్లపై వేసిన మట్టి తిరిగి కాలువలోకే చేరుతుంది. కనీసం ట్రాక్టర్లతో తొలగించిన సిల్ట్‌ను మరో ప్రాంతానికి తరలించడం లేదు. అనాలోచిత పనులపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాల వలన ఆలస్యం



ముందుగానే పనులు చేద్దామని భావించాం. ఆ సమయంలో వర్షాలు వచ్చాయి. దీంతో అప్పుడు పనులు చేయలేకపోయాం. గుడ్లవల్లేరు లాకుల నుంచి పోల్‌రాజ్ కాలువకు 700 క్యూసెక్కులకు గాను 300 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చింది. దిగువకు చేరడానికి కైకలూరు కాలువలో మట్టిని తొలగించాలని పనులు చేయిస్తున్నాం. ఈ విధానంపై ఆలోచన చేసి పనులను నిలుపుదల చేస్తాం.

– శిరీషా, ఇరిగేషన్ శాఖ డీఈఈ, కైకలూరు

గౌరీశంకర స్వామి హుండీ ఆదాయం రూ. 3.39 లక్షలు

గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కించినట్లు ఆలయ ఈఓ కె. వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగిందని పేర్కొన్నారు. మొత్తం ఆదాయం రూ 3,39,728 వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయం నాలుగు నెలల నాలుగు రోజుల సంబంధించినదని ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి



గుడ్లవల్లేరు: ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. బుధవారం గుడ్లవల్లేరు పంచాయితీలో నమస్తే డేలో భాగంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పోస్టర్స్‌ను అంటించారు. దుకాణాలతో పాటు ముఖ్య కూడళ్లలో ఈ పోస్టర్లను అంటించాలని గ్రామ కార్యదర్శి జె.నరసింహారావును ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యువజన నైపుణ్య దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

గుడ్లవల్లేరు: మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం రజినీకుమారి మాట్లాడుతూ ఉపాధి అవకాశాల కోసం విద్యార్థులు నైపుణ్యతను అలవర్చుకోవాలన్నారు. విద్యలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రుక్మిణి నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యా ప్రాముఖ్యతతో పాటు చేతి పనులకు కూడా సమానమైన ప్రాధాన్యం ఉండాలని విశదీకరించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మోడళ్ల ప్రదర్శనతో పాటు చిరు ఉపన్యాసాలు, నైపుణ్య ప్రదర్శనలు ఈ దినోత్సవంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

సుబ్బారాయుడికి బిందెలు సమర్పణ



అర్చకులకు బిందెలు బహూకరిస్తున్న దాతలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 20న జరిగే కావడి బిందెల ఉత్సవానికి దాతలు బుధవారం స్టీలు బిందెలను సమర్పించారు. కలిదిండి మండలం ఆవకూరుకు చెందిన చలమలశెట్టి నిరంజన్‌బాబు, ఉత్తమకుమార్, ఆనంద దాసు, ఉదయ సాయికుమార్, కుటుంబ సభ్యులు 116 స్టీలు బిందెలను స్వామి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఇతర అర్చకులకు అందజేశారు. దాతలను సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి అభినందించారు.